

# సాహితీ గిరి 'శకారత్వం'

సెప్టెంబర్ 21 – మహాకవి గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా... ఊహాజనిత సంభాషణ

## రాంభట్ల నృసింహ శర్మ

**(స్థలం: విశాఖపట్నం ఆర్.టి.సి. కూడలి...సమయం...రాత్రి 12 గంటలు తర్వాత...)**

రాతి తిన్నె మీద అంతవరకూ బొమ్మలా కూర్చున్న గురజాడ అప్పారావు గారిలో చిన్న కదలిక.. అతని ఎదురుగా విద్యుద్దీపం వెలుగు నీడల మధ్య ఎవరిదో ఓ అస్పష్ట ఆకారం. అటే చూస్తూ దృశ్యస్పష్టత కోసం మరికాస్త ముందుకు వంగిన గురజాడ తనలో...

గురజాడ: యవరదీ! చీకట్లో కనిపించడం లేదు..కాస్త యిసుంటా రండి! *(ప్రతిగా అట్నుండి సన్నగా దగ్గు)*

దగ్గినంత మాత్రాన యావనీ ఆచూకీ పట్టడం?

యవరన్నా! మీరు...మహానుభావులు?

**(ఇంతలో తెరలు తెరలుగా గలగలగలమని నవ్వు)**

ఔరా! యింద్రజాలీ! మధురవాణీ!

**మధురవాణి:** హుఁ! వచ్చిన యింతసేపటికనమాట పలకరింపు. యింత రచయితలయ్యుండీ మీ మనిషిని కనిపెట్టజాలినారుకారు కదా!

**గురజాడ:** పేరూ, సాకీనూ చెప్పాలి కాని, దగ్గుతూ తుమ్ముతూ నిలబడ్డం నేస్తులకు న్యాయవేనా?

**మధురవాణి:** మరిప్పుడు ఎలా గుర్తుపట్టారో!

**గురజాడ:** ఏవుందీ! నీ నవ్వు. నాకు తట్టలేదు కాని, లేకపోతే మా నండూరి చెప్పినట్లు 'ఒక్క నవ్వే చాలు ఒజ్జిర వొయిడూర్యాలు' అని నేనే అనీసి వుండేవాణ్ణి. నువ్వంటే నవ్వే...

**మధురవాణి:** పోన్లెండి! అంత విచారం దేనికీ! ఒజ్జిరవొయిడూర్యాలు కాకపోతే, 'ముత్యాలసరాలే' కానిండు.

**గురజాడ:** ఈ చమత్కారాలకేం గాని యింతకూ వచ్చిన పనేమిటి?

**మధురవాణి:** జరూరు ప్రయోజనం కలిగి వచ్చాను. వర్తమానం చెయ్యకుండా వచ్చినందుకు క్షమించాలి.

**గురజాడ:** ఈ వేళప్పుడు అంత జరూరు పనేవిటో! *(ఆలోచిస్తూ యాధాలాపంగా రోడ్డు వైపు చూసి, కొంచెం కోపంగా)* మధురవాణీ! నీకు రవ్వంత దూరంలో నిలబడి యిటే చూస్తున్న ఆ కుర్రవాడెవడు? మళ్ళీ నీ బుద్ధి పెడదోవ పట్టలేదు కదా!

**మధురవాణి:** నా నిర్ణయమ్మీద నమ్మకం లేని మనిషితో యావని మాట్లాడ్డం సాన్దానికి నీతి లేదనుకున్నారో! అక్కడ నిలబడ్డ ఆ కుర్రవాడు మహేశం.

**గురజాడ:** ఆ సంగతి ముందే మనవి చేసుండాల్సింది. సరే, ఇద్దరూ యిలా రండి! ఈ తిన్నె మీదనే కూర్చుందాం... *(ముగ్గురూ కూర్చుంటారు)* ఊఁ ఇహ చెప్పండి.

**మధురవాణి:** యేదీ! ఆ చెయ్యిలా యివ్వండి.

**గురజాడ:** జాతకం చెబుతావా యేమిటి ?

**మధురవాణి:** సిద్ధాంతిననుకున్నారు కాబోలు! *(తన చేత్తో గురజాడ చేతిని అందుకొని షేక్‌హ్యాండ్ చేస్తూ)* హేపీ బర్త్‌డే టూ యూ!

**గురజాడ:** ఇదేవిటి యీ వికారం ?

**మధురవాణి:** వికారం కాదు! విషెస్!! ఈ రోజు సెప్టెంబర్ ఇరవయ్యొకటో తేదీ అని మరిచారో!

**గురజాడ:** మరపు కాదు గానీ! గుర్తుంచుకో లేదు. "తారీఖులు, దస్తావేజులు యివి కావోయ్ చరిత్ర సారం" అన్నాడు కదా మా వాడు. అయినా ముసలివాణ్ణి... నా కెందుకూ యీ బర్తుడేలు ?

**మధురవాణి:** మీరా! ముసలివాళ్ళు! యవరా అన్నవారు? మనిషికీ మనిషికీ తారతమ్యం యీ మధురవాణే కనిపెట్టాలి. రామప్పంతుల్లాగ మీసాలకి రంగు వేసుకుంటే తిరిగి యౌవనం వస్తుంది. *( అలా మాట్లాడుతూ లేచి, గురజాడ తలనూ, వీపునూ చేత్తో దులుపుతూ )* యేం! ధూళీ, సంరక్షణ చేసేవాళ్ళు లేకపోబట్టి కదా - తలనిండా యీ కాకి రెట్టలూ, దుమ్ము కొట్టుకుపోయిన ఈ శాలువా... *(దగ్గరగా వాసన చూసి)* అబ్బ! స్నానం చేసి ఎన్నాళ్లయిందో !

